సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం : 27 : జనవరి : 2023



గిరిజనాభివృద్ధికి కృషి

ఏజెన్సీలో గిరిజనుల సర్వతోముఖాభివృద్ధికి ఐటీడీఏ కృషి చేస్తోందని ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు తెలిపారు. 10లో



నల్ల చట్టాలపై మాట మార్చారు

నల్ల చట్టాల రద్దు విషయంలో కేంద్ర ప్రభుత్వం మాట తప్పి రైతులను మోసం చేసిందని రైతు సంఘాల నేతలు విమర్శించారు. 10లో



వాతావరణం

జిల్లాలో శుక్రవారం పగటిపూట సాధారణ ఉష్ణోగ్రత ఉంటుంది. తెల్లవారుజామున మంచు, చలి అధికంగా ఉంటాయి.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం వైభవంగా సాగింది. తెల్లవారుజామున గర్భ గుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

పెద్దమ్మతల్లి సన్నిధిలో అక్షరాభ్యాసాలు



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మాఘ పంచమిని పురస్కరించుకుని పెద్దమ్మతల్లి ఆలయంలో గురువారం సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 60 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చకులు అభిషేకం, గణపతిపూజ గావించారు. కాగా, శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి 108 సువర్ణ పుష్పాలతో అర్చన చేశారు. ఆ తర్వాత హారతి, మంత్రపుష్పం, నైవేద్యం సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో అర్చకులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

వైల్డ్‌లైఫ్ రేంజర్లకు నగదు పురస్కారం



భీమానాయక్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న రేంజర్

పాల్వంచరూరల్: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన వన్యమృగాల సంరక్షణ విభాగం(వైల్డ్‌లైఫ్) చాతకొండ రేంజర్ శ్రీనివాసరెడ్డి, ఆళ్లపల్లి రేంజర్ సెక్షన్ అధికారి సూక్యాకు రూ.10 వేల చొప్పున నగదు, ప్రశంసాపత్రాలను సీఎఫ్ఓ భీమానాయక్ గురువారం అందజేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా వరంగల్‌లోని కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఈ మేరకు వారికి పురస్కారాలు పంపిణీ చేశారు. వీరితో పాటు విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన యానంబైల్ రేంజర్ సీహెచ్.శ్రీనివాసరావు, సెక్షన్ అధికారి వై.హారిక సైతం ప్రశంస పత్రాలు అందుకున్నారు.

భద్రాచలం ఏఎస్పీగా పరితోష్ పంకజ్



పరితోష్ పంకజ్

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం ఏఎస్పీగా పరితోష్ పంకజ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోని గ్రేహౌండ్స్ ఏఎస్పీగా పని చేస్తున్నారు. కాగా, ప్రస్తుత ఏఎస్పీ రోహిత్‌రాజ్‌ను హైదరాబాద్‌లోని గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా బదిలీ చేశారు. ఇక బీహార్‌లోని భోజ్‌పూర్ జిల్లా ఆరా నగరానికి చెందిన పరితోష్ పంకజ్ 2015 వరకు జర్మనీలోని మర్చంట్ నేవీ ఆధ్వర్యంలో ఉద్యోగం చేశారు. అప్పుడే యూపీఎస్సీపై దృష్టి సారించిన ఆయన ఉద్యోగం వదిలేసి పట్టుదలతో చదివారు. అయినా 2016, 2017, 2018 సంవత్సరాల్లో సివిల్స్ రాసినా విజయం సాధించలేకపోయారు. నాలుగో ప్రయత్నంగా 2019లో కష్టపడి చదివి ఆలిండియా స్థాయిలో 142వ ర్యాంక్ సాధించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, పక్కన ఎస్పీ వినీత్



వేడుకలకు హాజరైన విప్ రేగా, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల..



జిల్లా కోర్టులో జాతీయజెండా ఆవిష్కరిస్తున్న జడ్జి చంద్రశేఖరప్రసాద్

జిల్లా కోర్టులో..

కొత్తగూడెంటౌన్: గణతంత్ర వేడుకల సందర్భంగా కొత్తగూడెం జిల్లా కోర్టులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి ఎం.శ్యాంశ్రీ, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి భానుమతి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఆడెపు నీరజ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఏకూరి బాబురావు, సీఏఓ అనితావాణి, ఏఓ శైలజ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనుబ్రోలు రాంప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి భాగం మాధవరావు, కార్యవర్గ సభ్యులు మునిగడప వెంకటేశ్వర్లు, మహ్మద్ సాదిక్ పాషా, కన్నెగంటి శ్రీదర్, గాదె సునంద, మానిటరింగ్ కమిటీ సభ్యులు మెండు రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో....

జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ వినీత్ జాతీయ జెండా ఎగురవేసి వందనం చేశారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా కొత్తగూడెం వన్‌టౌన్, టూటౌన్ పోలీసుస్టేషన్లలో జెండా ఆవిష్కరించి జాతీయజెండాకు వందనం చేశారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, ఎస్సై షాహీన్‌లతో పాటు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధికి కృషి

అవరోధాలను అధిగమిస్తూ ప్రగతి వైపు పయనం

- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ అనుదీప్
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- హాజరైన విప్ రేగా, జెడ్పీ చైర్మన్ కోరం

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని మారుమూల గ్రామాల్లో పేదలు ఎక్కువగా నివసిస్తున్నారని, అవరోధాలను అధిగమిస్తూ జిల్లా సమగ్రాభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నామని కలెక్టర్ అనుదీప్ అన్నారు. నూతన కలెక్టరేట్‌లో గురువారం గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొదట కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. శ్రీరామనవమి, రాష్ట్రపతి పర్యటన, ముక్కోటి ఉత్సవాలు, సమీకృత అధికారుల సముదాయం ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ పర్యటన వంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. గోదావరి వరదల వంటి ఉపద్రవాలను కూడా సమష్టి కృషితో ఎదుర్కొన్నామన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా సహకారంతో ప్రగతి వైపు పయనిస్తున్నామని చెప్పారు.

ధరణి సేవలతో జిల్లాలో 1,897 సేల్ రిజిస్ట్రేషన్లు, 336 గిఫ్ట్ రిజిస్ట్రేషన్లు, 526 నాలా కన్వర్షన్లు మొత్తం 2,759 దరఖాస్తులను పరిష్కరించినట్లు తెలిపారు. కంటి వెలుగులో 48 టీమ్‌లతో 100 రోజుల పాటు శిబిరాలు నిర్వహిస్తున్నామని, 7.90 లక్షల మందికి పరీక్షలు చేయనున్నామని చెప్పారు.



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

జిల్లాలో ఇప్పటివరకు 421 మందికి రూ.42.10 కోట్లు దళితబంధు పథకం ద్వారా మంజూరు చేశామన్నారు. మనఊరు–మన బడి ద్వారా మొదటి విడతలో 368 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పారు. మండలానికి రెండు మోడల్ పాఠశాలలను ఈ నెలాఖరుకు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.



వేడుకల్లో కలెక్టర్ సతీమణి, కుమారుడు

బీడు భూముల సస్యశ్యామలం

గోదావరి నీటిని సద్వినియోగం చేసుకుని భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని 6,74,387 ఎకరాల బీడు భూములను సాగులోకి తెచ్చేందుకు రూ.13,058 కోట్లతో సీతారామ ఎత్తిపోతల పథకం పనులు చేపట్టామని, ప్రస్తుతం చురుగ్గా సాగుతున్నాయని పేర్కొన్నారు. ఇంకా దుమ్ముగూడెం వద్ద గోదావరిలో ఏడాదిపాటు నీరు నిల్వ ఉండేలా రూ.3, 200 కోట్లతో సీతమ్మసాగర్ ప్రాజెక్టు నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రాజెక్టు సమీప గ్రామాలు ముంపునకు గురికాకుండా గోదావరికి ఇరువైపులా కరకట్ట నిర్మిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 50 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోందని, ఈ విషయంలో రాష్ట్రంలోనే జిల్లా అగ్రస్థానంలో ఉందని తెలిపారు. మత్స్యశాఖ ద్వారా 743 చెరువుల్లో కోటి 61 లక్షల విలువైన కోటి 77 లక్షల చేపపిల్లలు పెంచుతున్నామని, తద్వారా 8 వేల మంది మత్స్యకారుల కుటుంబాలకు లబ్ధి చేకూరనుందని చెప్పారు. విద్యుత్ వినియోగదారులకు అందిస్తున్న రాయితీలు, ఉచిత కరెంటు వివరాలను వెల్లడించారు. జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా 66 లక్షల పనిదినాల కల్పన లక్ష్యం కాగా, ఇప్పటివరకు 44 లక్షల పనిదినాలను కల్పించి రూ.76 కోట్లు చెల్లించామని తెలిపారు. జిల్లాలో ప్రతినెలా రూ.26.29 కోట్లు పెన్షన్లుగా చెల్లిస్తున్నామని వివరించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 2,369 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించగా 2,334 మంది లబ్ధిదారులను గ్రామసభల ద్వారా ఎంపిక చేసి ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 1,673 పాఠశాలలు ఉండగా లక్షా 44 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని, వారికి ప్రభుత్వపరంగా అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, ఎస్పీ డాక్టర్ వినీత్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ దిండిగాల రాజేందర్, అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. కాగా, గణతంత్ర వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. కలెక్టర్ సతీమణి, కుమారుడు ప్రత్యేకాకర్షణగా నిలిచారు.



త్రివర్ణంలో సాయిబాబా..

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని డిగ్రీ కళాశాల సెంటర్‌లోని సాయిబాబా ఆలయంలో బాబాను మూడు రంగుల్లో సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా సాయిబాబాకు అభిషేకం, అష్టోత్తర నామార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కుంచాల రమేష్, గొర్ల వెంకటేశ్వరరావు, వనమా వీరభద్రరావు, శ్యామల తదితరులు పాల్గొన్నారు. – భద్రాచలంటౌన్



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..

కొత్తగూడెంటౌన్: నూతన కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో గణతంత్ర వేడుకల సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు చేసిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పాల్వంచకు చెందిన డీఏవీ పాఠశాల విద్యార్థులు జైహింద్.. వందేమాతరం అనే దేశభక్తి పాటకు అనుగుణంగా చేసిన నృత్యం అలరించింది. ఇంకా కొత్తగూడెంలోని సెయింట్ మేరీస్ హైస్కూల్, చుంచుపల్లి ఏహెచ్ఎస్ పాఠశాల, చంద్రుగొండ కేజీహెచ్ఎస్, పడమట నర్సాపురం ఏజీహెచ్ఎస్, కొత్తగూడెం కూలీలైన్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు వివిధ పాటలకు నృత్యాలు చేయగా, వేడుకలకు హాజరైన పలువురు ప్రముఖులు వారిని అభినందించారు. అనంతరం విద్యార్థులకు కలెక్టర్ అనుదీప్, ప్రభుత్వ చీఫ్ విప్ రేగా కాంతారావు, ఎస్పీ డాక్టర్ వినీత్, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, గ్రంథాలయ చైర్మన్ దిండిగల రాజేందర్ మెమెంటోలు అందజేశారు.



డీఏవీ పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన..

వైభవంగా వాగ్గేయకారోత్సవాలు

భద్రాచలం: భక్త రామదాసు జయంతి వేడుకల సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి సన్నిధిలోని చిత్రకూట మండపంలో వాగ్గేయకారోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దేవస్థానం, చక్ర సిమెంట్స్ వారి నేంద్రగంటి అలివేలు మంగ సర్వయ్య చారిటబుల్ ట్రస్ట్, నాదసుధా తరంగిణి కల్చరల్ ట్రస్ట్, నామగాన లహరి కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో రెండో రోజైన గురువారం సంగీత కళాకారులు తమ ప్రదర్శనలతో భక్తులను, ఆహూతులను అలరించారు. తొలుత స్వామివారి ఉత్సవ మూర్తులను పల్లకీ సేవగా తీసుకొచ్చి చిత్రకూట మండపంలోని ప్రత్యేక వేదికపై ఆశీనులు చేశారు. అర్చకులు పూజలు చేసి స్వామి వారికి హారతి సమర్పించారు. అనంతరం దేవస్థానానికి చెందిన నాదస్వర, భజన బృందాలు రామదాసు కీర్తనలను ఆలపించాయి. హైదరాబాద్, విజయవాడ, చెన్నై నుంచి వచ్చిన కళాకారులు, మల్లాది సూరిబాబు రామచంద్రస్వామితో పాటు భక్త రామదాసుకు కీర్తనలతో నీరాజనం పలికారు. కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్యులు కేఈ స్థలశాయి తదితరులు పాల్గొన్నారు.



రామదాసు కీర్తనలు ఆలపిస్తున్న సంగీత కళాకారులు

మార్గదర్శకాలు పాటించండి

- ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో లోటుపాట్లు ఉండొద్దు
- విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మ

కొత్తగూడెంఅర్బన్: త్వరలో జరగబోయే ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు సంబంధించి సీనియారిటీ జాబితాల తయారీ ప్రక్రియ యుద్ధప్రాతిపదికన జరుగుతోందని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ బి.వెంకటనరసమ్మ తెలిపారు. గురువారం ఆమె జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పదోన్నతులు, బదిలీల సీనియారిటీ జాబితాల తయారీ ప్రక్రియను పరిశీలించారు. ఈ విషయంలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. జాబితాలో పేర్లు ఉన్న అర్హత గల ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్ల వెరిఫికేషన్ ప్రక్రియ కూడా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పదోన్నతికి సంబంధించి అర్హత గల స్కూల్ అసిస్టెంట్‌ల సర్వీస్, రిజిస్టర్ల వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతోందని వివరించారు. పాత పాల్వంచలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లోకల్ బాడీ ప్రధానోపాధ్యాయుల పదోన్నతికి అర్హత గల ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్ల వెరిఫికేషన్ ప్రక్రియ శుక్రవారం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యాశాఖ అధికారులకు సూచనలు చేస్తున్న వెంకటనర్సమ్మ


అభివృద్ధిలో ఆదర్శం.. ఇల్లెందు

- తెలంగాణలో హ్యాపెనింగ్ ప్లేస్..
- ట్విట్టర్‌లో కేటీఆర్ ప్రశంసలు
- ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్‌కు మంత్రి అభినందనలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : తెలంగాణలో అభివృద్ధికి నమూనాగా ఇల్లెందు పట్టణం మారిందని రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ప్రశంసించారు. గణతంత్ర దినోత్సవం రోజున ట్విట్టర్ వేదికగా ఇల్లెందులో జరిగిన, జరుతున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించి ఫొటోలను కేటీఆర్ షేర్ చేశారు. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి ఇతర పట్టణాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. తెలంగాణలో అభివృద్ధికి సంబంధించిన అంశంలో ఇల్లెందు ఇప్పుడొక హ్యాపెనింగ్ ప్లేస్‌గా మారిందని పేర్కొన్నారు. పట్టణంలో గోడలకు వేసిన చిత్రాలు, రోడ్డు మధ్యలో సెంట్రల్ లైటింగ్, వర్టికల్ గార్డెన్, పట్టణ ప్రకృతి వనాలు, పార్కులు, ఓపెన్ జిమ్‌లు, రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన ఫౌంటెయిన్, కొత్తగా అందుబాటులోకి వచ్చిన మౌలిక సదుపాయాలు ఇలా అనేక విధాలుగా పట్టణం అభివృద్ధి చెందుతోందని కేటీఆర్ అభినందించారు.

ఎమ్మెల్యే, చైర్మన్‌లకు ప్రశంసలు

ఇల్లెందు పట్టణ అభివృద్ధి పట్ల ఎమ్మెల్యే హరిప్రియా నాయక్, మున్సిపల్ చైర్మన్ డి.వెంకటేశ్వర్లు చూపిస్తున్న తపన కారణంగా ఇటీవల కాలంలో ఇక్కడ వేగంగా అభివృద్ధి జరుగుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే, చైర్మన్‌ల చొరవకు సీఎం కేసీఆర్ చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధ, మున్సిపల్ మంత్రిగా తాను అందిస్తున్న సహకారం తోడైందన్నారు. మొత్తంగా ఇల్లెందు పట్టణంలో జరుగుతున్న అభివృద్ధిని సూచించేలా రెండు ట్వీట్లు చేశారు. ఈ రెండు ట్వీట్లలో ఎనిమిది అభివృద్ధి పనులకు సంబంధించి 30 ఫొటోలను షేర్ చేశారు.





ఇల్లెందు అభివృద్ధిపై ట్విట్టర్‌లో కేటీఆర్ ప్రశంస..

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచండి

డీసీహెచ్ఎస్ రవిబాబు

భద్రాచలంఅర్బన్ : గర్భిణులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన సేవలందించాలని, తద్వారా ప్రసవాల సంఖ్య పెరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ రవిబాబు అన్నారు. గురువారం ఆయన భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే వారితో సిబ్బంది మర్యాదగా నడుచుకోవాలని, వైద్య పరీక్షల కోసం ప్రైవేటు ఆస్పత్రులకు రిఫర్ చేయవద్దని అన్నారు. ఆస్పత్రిలో ఇంకేమైనా పరికరాలు అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలని, కలెక్టర్‌తో మాట్లాడి సమకూర్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆస్పత్రిలోని రెండు విభాగాల్లో సీనియర్ డాక్టర్లను నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరగా, కలెక్టర్‌తో చర్చిస్తానని హామీ ఇచ్చారుర. సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, ఆర్ఎంఓలు రాజశేఖర్ రెడ్డి, దేవిక, ఆరోగ్యశ్రీ విభాగం ఇన్‌చార్జ్ సంతోష్, వైద్యులు కిషన్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న రవిబాబు

‘ప్రశంస’ల వెల్లువ..

విధులపట్ల అంకితభావంతో పనిచేసిన వివిధ శాఖల ఉద్యోగులు, పలు విభాగాల్లో అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేసిన వారిని గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎంపిక చేసి వారికి గురువారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రధాన వేడుకలలో ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా కలెక్టర్ అనుదీప్, ఎస్పీ డాక్టర్ వినీత్, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు తదితరుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్రశంసాపత్రాలు పొందిన వారి వివరాలిలా ఉన్నాయి. – సూపర్‌బజార్(కొత్తగూడెం)


అదనపు కలెక్టర్‌కు ప్రశంసాపత్రం అందిస్తున్న కలెక్టర్, విప్


మధుసూదన్‌రాజు డీఆర్‌డీఓ · విద్యాలత జెడ్పీ సీఈఓ · సుధాకర్ పంచాయతీరాజ్ ఈఈ · డాక్టర్ శిరీష జిల్లా వైద్యాధికారి · అశోకచక్రవర్తి డీఆర్‌ఓ · శ్రీనివాసరావు డీపీఆర్‌ఓ · మరియన్న, జిల్లా ఉద్యాన అధికారి · వెంకటేశ్వర్లు, డీసీఓ


రమాకాంత్ డీపీఓ · రాంప్రసాద్ ఇరిగేషన్ ఈఈ · మనోహర్ తూనికలు, కొలతలు · భీమ్లా ఆర్‌అండ్‌బీ ఈఈ · రమేష్ విద్యుత్ ఎస్‌ఈ · త్రినాథ్‌బాబు డీఎం సివిల్ · మల్లిఖార్జునబాబు డీఎస్‌ఓ · వేణు, జిల్లా రవాణాశాఖాధికారి


శైలజ ఎన్‌హెచ్ ఈఈ · డాక్టర్ రవిబాబు డీసీహెచ్ఎస్ · జానయ్య ఎక్సైజ్ ఈఎస్ · విజేత, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ · రత్నకల్యాణి ఆర్డీఓ భద్రాచలం · స్వర్ణలత ఆర్డీఓ కొత్తగూడెం · అంకుష్‌వలి మున్సిపల్ కమిషనర్ · శ్రీనివాసరావు జిల్లా ఫైర్ ఆఫీసర్ · శ్రీకాంత్ మున్సిపల్ కమిషనర్ · అలీం, జిల్లా మార్కెటింగ్ అధికారి · సంజీవరావు, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి · సులోచనారాణి నోడల్ అధికారి · శ్రీనివాసరావు సీపీఓ · రామిరెడ్డి, డిస్ట్రిక్ట్ లీడ్ బ్యాంక్ మేనేజరు · డి.వెంకటేశ్వరరావు మున్సిపల్ చైర్మన్ · కాపు సీతాలక్ష్మి మున్సిపల్ చైర్‌పర్సన్ · అజ్మీరా రాంరవి జమేదార్, కలెక్టరేట్


ఎస్ సత్తిబాబు దఫేదార్, కలెక్టరేట్ · బి శ్రీను డ్రైవర్, కలెక్టరేట్ · ఖాదర్ సీసీ, కలెక్టర్ · నవీన్ పీఏ అదనపు కలెక్టర్ · విజయసారథి ఈడీఎం · సోమశేఖరశర్మ డీఈఓ · సంపత్, డీఆర్‌డీఓ సెర్ప్ ఇల్లెందు సీసీ · శ్రీనివాస్ పబ్లిక్ హెల్త్ డీఈ · నాగేశ్వరరావు జెడ్పీ సీఈఓ సీసీ · నాగదివ్య, తహసీల్దార్, గుండాల · కొచ్చెర్ల సురేష్ ఆధ్యాత్మికవేత్త · వెంకటేశ్వరరావు ఎన్‌జీఓ · వీరహనుమంతరావు సొసైటీ చైర్మన్ · తిరుమలేష్, మిషన్ భగీరథ ఈఈ · శర్మ ఓఎస్డీ, కలెక్టరేట్ · సూర్య, జూనియర్ అసిస్టెంట్, కలెక్టరేట్ · దినేష్ సీసీ, ఆర్‌ఐ



క్లుప్తంగా

మానవత్వం చాటుకున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు

చర్ల: మండలంలోని తిప్పాపురం అటవీ ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ బలగాలు మానవత్వాన్ని చాటుకున్నారు. వారం రోజుల క్రితం పామేడు సమీపంలో పూరిళ్లు దగ్ధమవుతున్న సమయంలో సత్వరమే స్పందించి మంటల్లో చిక్కుకున్న ఇద్దరు చిన్నారులను బయటకు తీసుకురావడమే కాక బాధిత ఆదివాసీ మహిళలకు అవసరమైన నిత్యావసర వస్తువులు అందజేసి ఇంటి నిర్మాణాన్ని చేపడతామని హామీ ఇచ్చారు. తాజాగా గురువారం సాయంత్రం తిప్పాపురం – పామేడుకు మార్గంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న గోరుకొండకు చెందిన కలుము జోగా అనే యువకుడు ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రగాయాలు కావడంతో క్షతగాత్రుడిని తిప్పాపురం సీఆర్‌పీఎఫ్ 151 బెటాలియన్ బి క్యాంపుకు తరలించారు. అసిస్టెంట్ కమాండెంట్ కాంబ్లే అమూల్ విజయ్ నేతృత్వంలో మన్మోహన్ సింగ్ పైంక్రా, బినయ్ లక్రా వైద్య సహాయం అందించారు. సరిహద్దుల్లో ఉన్న క్యాంపుల్లో ప్రాణాలతో అరచేతిల్లో పట్టుకొని విధులు నిర్వర్తించమే కాకుండా మానవత్వం చాటుతూ ఇటువంటి సేవా కార్యాక్రమాలను నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ అధికారులను జవాన్లను ప్రజానీకం అభినందిస్తున్నారు.

బావిలో దూకి యువకుడి ఆత్మహత్య


మృతి చెందిన అరవింద్

మణుగూరుటౌన్: మణుగూరు మండలం సుందరయ్యనగర్‌లోని ఓ యువకుడు బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సుందరయ్యనగర్‌కు చెందని అమూల్య ప్రసాద్ కుమారుడు అరవింద్(27) ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన నడుముకు తాడు కట్టుకొని బావిలో దూకి మృతి చెందాడు. వికాలంగుడైన అతడు ఇంట్లో ఒక్కడే ఒంటరిగా ఉండడంతో మానసికంగా ఎంతో కుంగిపోయేవాడు. ఈ క్రమంలో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటికి తాళం వేసి ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని స్థానికులు భావిస్తున్నారు. విషయం తెలిసిన మణుగూరు ఎస్సై రాజ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని చేరుకొని వివరాలు సేకరించారు. ఫిర్యాదు రాకపోవడంతో కేసు నమోదు చేయలేదని ఎస్సై తెలిపారు.

బెల్టు షాపుల్లో జోరుగా మద్యం విక్రయాలు


కేశవాపురం వద్ద బెల్టు షాపులో మద్యం ప్రియులు

పాల్వంచరూరల్: బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలు ఏరులై పారుతోంది. కనీసం గణతంత్ర దినోత్సవం రోజు కూడా మద్యం అమ్మకాల జోరుకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. వివరాలిలా.. మండల పరిధిలోని పెద్దమ్మ గుడి వద్ద సిండికేట్ షాపు నుంచి గణతంత్ర దినోత్సవానికి ముందురోజే బెల్టు షాపుల నిర్వాహకులు మద్యాన్ని పెద్ద ఎత్తున కొనుగోలు చేసి రహస్య ప్రదేశాల్లో నిల్వ చేశారు. ఈక్రమంలో గురువారం పెద్దమ్మ గుడి, కేశవాపురం వద్ద బెల్టు షాపుల్లో బహిరంగంగానే మద్యం విక్రయాలు నిర్వహించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా మద్యం విక్రయాలను ప్రభుత్వం నిషేధించినా.. ఆచరణలో అమలు చేసే ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో బెల్టు షాపుల నిర్వాహకులు జోరుగా అమ్మకాలు కొనసాగించారు.

కోడి పందేల స్థావరంపై దాడి

కల్లూరు: మండలంలోని పేరువంచ సమీపాన నారాయణపురం రోడ్డు పక్కన గురువారం కోడి పందేలు నిర్వహిస్తుండగా పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా ముగ్గురిని అదుపులోకి తీసుకుని రూ.5,400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కొండల్‌రావు తెలిపారు. అయితే, ఘటనా స్థలం నుంచి మరో ఎనిమిది మంది పరారయ్యారని పేర్కొన్నారు.

మది నిండా జాతీయ జెండా..!

రెపరెపలాడిన త్రివర్ణ పతాకం
- జెండావిష్కరణలు.. ప్రదర్శనలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యాన సేవా కార్యక్రమాలు


చుంచుపల్లి: జెడ్పీ కార్యాలయంలో రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొన్న చైర్మన్ కోరం కనకయ్య, అధికారులు

వాడవాడల మువ్వన్నెల జెండా సగర్వంగా రెపరెపలాడింది. ప్రతీ మదిలో జాతీయ భావాన్ని నింపింది. 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలను గురువారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాలు, కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యాన అధికారులు, ప్రజాప్రతినిధులు త్రివర్ణ పతకాన్ని ఆవిష్కరించి ఘనంగా జరుపుకున్నారు. అనంతరం జెండాకు వందనం చేసి జాతీయ గేయాన్ని ఆలపించి దేశభక్తిని చాటుకున్నారు. మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వంటి మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ జాతీయ సమైక్యతను చాటేలా నినాదాలు చేస్తూ ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను వివరించగా.. పలు క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యాన రక్తదానం, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్


సూపర్‌బజార్(కొత్తగూడెం): బీఆర్ఎస్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ రేగా కాంతారావు


అశ్వాపురం: మండల కేంద్రంలో గౌతమీనగర్ కాలనీలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న భారజల కర్మాగారం జీఎం కేవీ థాలే


కొత్తగూడెంటౌన్: చంద్రుగొండ కేజీహెచ్ఎస్ పాఠశాలలో చిన్నారి నృత్య ప్రదర్శన



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఉమెన్స్ కళాశాలలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు


భద్రాచలం: జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య, తదితరులు


ఇల్లెందు: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జెండా ఎగుర వేసి వందనం సమర్పిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ


భద్రాచలం: దేవస్థానం క్యాంపు కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న ఈఓ శివాజీ


కొత్తగూడెంటౌన్: చుంచుపల్లి ఏజీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థుల నృత్య ప్రదర్శన

యువజన సమ్మేళనంలో పాల్గొనేందుకు..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏజెన్సీ ప్రాంతానికి చెందిన 10 మంది యువతీ, యువకులు ఈ నెల 29 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు మార్గోవ్ (దక్షిణ గోవా)లో జరగనున్న 14వ ట్రైబల్ యూత్ ఎక్సేంజ్‌లో భాగంగా యువజన సమ్మేళనంలో పాల్గొనేందుకు సీఆర్పీఎఫ్ అధికారుల ఆధ్వర్యంలో బయలుదేరనున్నారు. ఈమేరకు విద్యార్థులు, సీఆర్పీఎఫ్ సహాయకులకు అవసరమైన అన్ని సౌకర్యాలను సీఆర్పీఎఫ్ అధికారులు సమకూర్చారు. గురువారం బయలుదేరగా.. దాదాపు వారం రోజుల పాటు అక్కడే జరిగే వివిధ సంస్కృతి, భాష, జీవనశైలి, విద్యామార్గాలు, అభివృద్ధి కార్యకలాపాలు, విద్యా అవకాశాలను పరిశీలన కోసం వివిధ ప్రాంతాలను సందర్శించనున్నారు. అంతేకాక అక్కడ అనుబంధించబడిన స్థానిక సంఘాలు, యువతతో సంభాషిస్తారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో 141 సీఆర్పీఎఫ్ కామాండెంట్ ప్రశాంత్‌ధర్, అధికారులు పాల్గొన్నారు.


సమ్మేళనంలో పాల్గొనేందుకు బయలుదేరిన యువతతో అధికారులు

కార్పొరేట్ ఏరియాలో కమ్యూనిటీ హాల్

భూమి పూజ చేసిన సింగరేణి డైరెక్టర్లు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని త్రిమాత ఆలయం వద్ద సుమారు రూ.5 కోట్లతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి గురువారం సింగరేణి డైరెక్టర్లు ఎస్.చంద్రశేఖర్, ఎన్.బలరామ్, సత్యనారాయణరావు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ ఏరియాలో కమ్యూనిటీ హాల్ లేదనే విషయాన్ని సీఎండీ దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఈ నిర్మాణంతో కార్మికుల చిరకాల వాంఛ నెరవేరనుందని చెప్పారు. సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో మొత్తం 1,120 సీటింగ్ సామర్థ్యం, ఇతర సౌకర్యాలతో ఈ కమ్యూనిటీ హాల్ నిర్మించనున్నట్లు తెలిపారు. కాగా, ఈ హాల్ కోసం ఏరియా ఉపాధ్యక్షుడు ఎం.సోమిరెడ్డి ఎన్నోమార్లు వినతులు ఇచ్చారని నాయకులు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జీఎంలు కె.బసవయ్య, అందెల ఆనందరావు, సీహెచ్.రమేష్‌బాబు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు బివెంకట్రావుతో పాటు ఎం.సోమిరెడ్డి, మూర్తి, కొండయ్య, వెంకటేశ్వరరావు, బి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.


కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న డైరెక్టర్లు

బీజేపీ దుశ్చర్యలను ఎండగట్టేందుకే యాత్ర


సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క


మహిళ సమస్యలు తెలుసుకుంటున్న భట్టి విక్రమార్క

ఎర్రుపాలెం: కాంగ్రెస్ శ్రేణులు కలిసికట్టుగా హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రలో పాల్గొని రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఉద్దేశం, మతం పేరిట లబ్ధి పొందేందుకు బీజేపీ చేస్తున్న దుశ్చర్యలను ఇంటింటా వివరించాలని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. మండలంలోని మామునూరు గ్రామంలో గురువారం ఆయన హాత్ సే హాత్ జోడో యాత్ర చేపట్టారు. తొలుత రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పించాక కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం యాత్రలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్న భట్టి.. పాలక ప్రభుత్వాల తీరును వివరించారు. మిర్చి రైతులు ఏర్పాటు చేసిన కల్లంలో కూలీలతో మాట్లాడి మిర్చి దిగుబడి, ధరల వివరాలు ఆరా తీశారు. రైతుల సమస్యలు, గిట్టుబాటు ధరలపై రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. కాగా, ప్రధాని మోదీ పాలనలో ఆర్థిక అసమానతలు పెరిగిపోగా, దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. అలాగే, ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీ లౌకిక వాదాన్ని కాలరాసి మతం పేరిట వైషమ్యాలను పెంచి పోషిస్తోందని తెలిపారు. ఈ యాత్రలో పీసీసీ సభ్యుడు శీలం ప్రతాపరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ మూరాబత్తుల మోహన్‌రావుతో పాటు తల్లపురెడ్డి ప్రవల్లిక, శీలం శ్రీనివాసరెడ్డి, తల్లపురెడ్డి నాగిరెడ్డి, గంటా తిరుపతమ్మ, కడియం శ్రీనివాసరావు, మల్లెల లక్ష్మణరావు, అనుమోలు కృష్ణారావు, బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, లింగాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాకెవరూ అడ్డు లేరు...

- వైరా రిజర్వాయర్‌లో అక్రమంగా మట్టి తవ్వకం
- రాత్రింబవళ్లు తరలిస్తున్నా కన్నెత్తి చూడని అధికారులు


వైరా రిజర్వాయర్ శిఖంలో మట్టి తవ్వుతున్న ప్రొక్లెయినర్

వైరా/కొణిజర్ల: వైరా రిజర్వాయర్ నుంచి అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతూ ఇష్టారాజ్యంగా తరలిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. స్థానిక రైతులెవరైనా పొలానికి మట్టి తోలుకుంటామంటే సవాలక్ష ఆంక్షలను బూచిగా చూపే అధికారులు ఇప్పుడు రా త్రింబవళ్లు మట్టి తవ్వకం, తరలింపు జరుగుతున్నా ఏమీపట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

వందలాది ట్రిప్పులు...

వైరా మున్సిపాలిటీ పరిధి కొణిజర్ల మండలం లాలాపురరంలో కొందరు బడాబాబులు నాలుగు జేసీబీలతో రిజర్వాయర్ శిఖం భూమిలో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు చేపట్టి ఇరవైకి పైగా ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. గత నాలుగు రోజుల పాటు రాత్రి పూట తవ్వకాలు చేపట్టగా గురువారం బరి తెగించి పట్టపగలే తవ్వకాలకు దిగడం గమనార్హం. ఈ నాలుగు రోజుల్లో కలిపి వందలాది ట్రిప్పుల మట్టిని పల్లిపాడు ఏన్కూరు రోడ్డులో ఓ బడా వ్యాపారి ఏర్పాటు చేస్తున్న 12 ఎకరాల వెంచర్‌కు ఈ మట్టి తోలకాలు చేపట్టినట్లు సమాచారం. రిజర్వాయర్‌లో 10 నుంచి 15 అడుగుల వరకు లోతు మేర గుంతలు తవ్వి మట్టి తరలిస్తుండడంతో వర్షాకాలం వీటిలో నీరు చేరి ప్రమాదాలు జరిగే అవకాశముంది. మరోపక్క లాలాపురం నుంచి రేయింబవళ్లు ట్రాక్టర్లు వచ్చివెళ్తుండడంతో గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ దందా వెనక అధికార పార్టీ ప్రజాప్రతినిధుల హస్తం ఉండడంతోనే అధికారులు పట్టించుకోకపోగా.. చూసీచూడనట్లు వ్యవహరించాలని సిబ్బందికి సూచించినట్లు సమాచారం.

చర్యలు తీసుకుంటాం..

వైరా రిజర్వాయర్ నుంచి అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. ఇప్పటికే వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను పంపించి తవ్వకాలు నిలిపి వేయించాం. శుక్రవారం స్వయంగా పరిశీలించి బాధ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తాం.
– శ్రీనివాస్, డీఈ, ఐబీ

ప్రేమించి పెళ్లి చేసుకుని ముఖం చాటేసిన భర్త

కారేపల్లి: ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త మొఖం చాటేసి వెళ్లిపోయాడు. మరోపక్క అత్త ఇంట్లో ఉండనివ్వకుండా గెంటేసింది. ప్రేమించి పెళ్లి చేసుకుందనే నెపంతో తల్లిదండ్రులు సైతం పుట్టింటికి రానివ్వడం లేదు. దీంతో గత్యంతరం లేక ఆ యువతి కళ్లకు గంతలు కట్టుకుని అంబేడ్కర్ విగ్రహం ఎదుట దీక్షకు దిగింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని యర్రబోడుకు చెందిన సునీత కారేపల్లిలో చదువుకునే సమయాన కారేపల్లికి చెందిన నాగమణి కుమారుడు సముద్రాల వేణు ప్రేమ పేరిట నమ్మించాడు. ఆతర్వాత ఆయన పెళ్లికి ససేమిరా అనడంతో సునీత వేణు ఇంటి ఎదుట దీక్ష చేపట్టడంతో గత ఏడాది అక్టోబర్ 26న కుల, మహిళా సంఘాల నాయకులు ఒప్పించి ఇద్దరికీ వివాహం జరిపించారు. ఆతర్వాత సునీతను హైదరాబాద్ తీసుకెళ్లిన ఆయన ఆరు నెలల పాటు ఉద్యోగం చేస్తూ జీవించగా, ఇటీవల ఖమ్మం తీసుకొచ్చి వదిలేశాడు. అప్పటి నుంచి వేణు జాడ లేకపోగా, సునీత కారేపల్లిలోని అత్తగారింటికి చేరి ఓ బేకరీలో పనిచేస్తోంది. ఈ విషయమై కోర్టులో కేసు నడుస్తుండగా, ఆమె అత్త నాగమణితో పాటు బంధువులు పలువురు సునీతపై దాడి చేసి బుధవారం బయటకు గెంటేశారు. దీంతో గురువారం ఆమె తనకు న్యాయం చేయాలని కోరుతూ కళ్లకు గంతలు కట్టుకుని అంబేడ్కర్ విగ్రహం ఎదుట దీక్షకు దిగింది. ఈ విషయమై ఎస్సై పుష్పాల రామారావు మాట్లాడుతూ వేణుపై సునీత ఇచ్చిన ఫిర్యాదుతో నమోదు చేసిన కేసు కోర్టులో నడుస్తుండగా, ఇటీవల దాడులపై కూడా కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈమేరకు ఆమెను దీక్ష విరమించి కోర్టు ద్వారా సమస్య పరిష్కరించుకోవాలని సర్దిచెబుతున్నట్లు చెప్పారు.